

# దూరపు కొండలు

## అవుసలి వీరబ్రహ్మం

**15 డిసెంబరు 1970:** తొలిమాట:

పదహారు వసంతాలు పసందుగా పూర్తిచేసుకుని పదిహేడో వసంతంలోకి ప్రవేశించబోతున్నాను. ఇంకా పదహారు రోజుల్లో నా పుట్టినరోజు వస్తోంది. ఈ పుట్టినరోజు వేడుకను ఎంతో వైభవంగా జరపాలనుకుంటున్నారు మా అమ్మానాన్న. ఎంతోమంది ప్రముఖులు వస్తారట. ముఖ్యంగా సినీ ప్రముఖులు. నన్ను సినిమాల్లో చేర్పించాలనుకుంటున్నారులా వుంది. ఎందుకీ ఆలోచనకు వచ్చారు? నేను అందంగా వున్నాననా? లేక డబ్బుకోసమా??

'అసలు మనిషికి ఏం కావాలి?'

***1 జనవరి 1971:* అంకురార్పణ:**

రవివర్మ నన్ను చూడలేదు కానీ, చూసివుంటే మరింత అద్భుతమైన కళాఖండాలను సృష్టించేవాడు. ఎన్నో శృంగార కావ్యాలు రచించిన కవులు నన్ను చూస్తే తాము సృష్టించిన అందాల నాయికలు దేనికీ పనికి రారని వారే అంగీకరిస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే అందానికి కేరాఫ్ అడ్రస్‌లా వున్నాను. నా బర్త్‌డే పార్టీ ఎంత వైభవంగా జరిగిందో మాటల్లో చెప్పలేను. పుర ప్రముఖులు, సినీ ప్రముఖులు ఎంతోమంది హాజరయ్యారు. ఎత్తైన బంగళాను, ముందున్న అందమైన, విశాలమైన తోటనీ రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించిన విధానాన్ని దూరంనుంచి చూస్తే దేవలోకంనుండి దిగివచ్చిన పూలరథమా అన్పిస్తుంది. దివినుండి భువికి దిగి వచ్చిన అప్సరసలా మేడమీదినుంచి తోటలోకి నడిచివస్తున్న నన్ను అందరూ చూసి నోరెళ్ళబెట్టడం నాకానందం కలిగించింది. ఈ పుట్టినరోజుకి ఓ ప్రత్యేకత వుంది. అది సినీ దర్శక, నిర్మాతలు ప్రత్యేకంగా ఆహ్వానింపబడటం. ప్రముఖ దర్శకుడు సురేంద్ర వర్మ గారు ముఖ్య ఆకర్షణ. విఐపీలకు ప్రత్యేకమైన పార్టీ యివ్వటం జరిగింది. వారు నా అందాన్ని ఎంతగానో మెచ్చుకున్నారు. ముఖ్యంగా నా కళ్ళని. వీటిమీద ఓ కావ్యమే రాయొచ్చుట. అంత పెద్ద డైరెక్టర్ నా అందాన్ని మెచ్చుకోవటం సాధారణ విషయం కాదు. తన తదుపరి చిత్రంలో నాకు నాయిక పాత్ర యిస్తానన్నారు. మాట యిస్తే తప్పేరకం కాదాయన. నా అందానికి, అదృష్టానికి చాలామంది అసూయపడ్డారు. పైపైన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ.

అమ్మానాన్నల ఆనందానికి అంతులేదు. అసలు వారు నన్ను సినిమాల్లో చేర్పించటం ద్వారా ఏమాశిస్తున్నారు. వారి ఆశ.. ఆశయమేమిటో కానీ దానికి పునాది వేయటంలో సఫలీకృతులయ్యారు. సినిమాల్లోకి ఆడపిల్లల్ని ప్రవేశపెట్టడం సాధారణంగా ఏ తల్లిదండ్రులకూ ఇష్టముండదు. మరి నా తల్లిదండ్రులు ఎందుకింతగా ఉత్సాహపడుతున్నారు.

'నా నుంచి నా తల్లిదండ్రులు కోరుతున్నదేమిటి?'

***20 నవంబర్ 1971:* తెరంగేట్రం:**

ఇచ్చినమాట ప్రకారం సురేంద్రవర్మ తన తదుపరి చిత్రంలోకి నన్ను నాయికగా తీసుకున్నారు. ఈరోజు నా తొలిసినిమా, తొలిషూటింగ్ సన్నివేశ చిత్రీకరణ జరిగింది. చాలా భయపడిపోయాను. నటన అనేది అంత సులభంకాదని అర్థమైంది.

వర్మగారు సత్తాగల దర్శకులు. కొత్త కొత్త ప్రయోగాలు చేయడం అతనికి

యిష్టం. ఎంతో శ్రమపడి తనక్కావలిసిన నటనని నానుంచి రాబట్టుకున్నాడు. షూటింగ్ పూర్తయ్యాక అందరూ నన్ను మెచ్చుకున్నారు. ఈ సినిమా ఎంతో వైవిధ్యభరితంగా ఉంటుందట. హీరోయిన్ ఓరియంటెడ్ సబ్జెక్ట్. కొత్త హీరోయిన్‌తో ఓ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టబడింది. నా సినీరంగ జీవితానికి అరంగేట్రం మొదలైంది. దీనిపై భవిష్యత్తులో తీర్పు ఎలా ఉండబోతుందో:

నా సినీ భవిష్యత్తు ఈ సినిమా విజయం మీదే ఆధారపడివుంది. గెలుపుకోసం పరుగు ప్రారంభమైంది.

ఫలితం– ఓటమి అయినా విజయం అయినా పోరాటం మాత్రం ఆగదు. అదేనా జీవితమంటే?

*20 ఫిబ్రవరి 1972: మొదటి అపజయం:*

పూలదారి అని పరుగెడుతుంటే అవి మాయమై వాటి స్థానంలో ముళ్ళు ప్రత్యక్షమైనట్టూ...త్రాగబోయే పాలు విరిగినట్లుగా మారింది పరిస్థితి. ఆ ప్రయోగాత్మక సినిమా మధ్యలోనే గుండెపోటుతో అకస్మాత్తుగా వర్మగారు మరణించారు. పరిశ్రమ యావత్తూ దిగ్భ్రాంతి చెందింది. ఆయన మరణం సినీరంగానికే తీరనిలోటు. ప్రముఖులంతా నివాళు లర్పించారు. తీస్తోన్న సినిమా మధ్యలోనే ఆగిపోయింది. అంతటి సృజనాత్మకత కలిగిన సబ్జెక్ట్‌ని పూర్తి చేయడానికి ఎవరూ సాహసించలేదు. నిర్మాత కూడా ఆగిపోయిన సినిమాపట్ల శ్రద్ధ చూపలేదు. దాని అతీగతీ పట్టించుకునే నాధుడే లేకపోయారు. ఆ విధంగా ఒక ఉత్తమమనుకున్న సినిమా, ఒక నటి బంగారు భవిష్యత్తు.. మధ్యలోనే ఛిన్నాభిన్నమైపోయింది. ఆ సినిమాలో నటించిన నన్ను పట్టించుకునే వారెవరూ లేరు. పనీపాటా లేకుండా గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోవాల్సి వస్తోంది.

కాలం పరమబోరుగా సాగుతోంది.

*10 మార్చి 1974: పునః ప్రవేశం*

సురేంద్ర వర్మ దగ్గర కోడైరెక్టర్‌గా పనిచేసిన పూర్ణచంద్ర పూజారి తొలిసారి ఒక మసాలా చిత్రానికి డైరెక్టర్‌గా చేస్తున్నాడు. అందులో వాంప్ పాత్రకు నన్ను తీసుకుంటానన్నాడు. అయితే హీరోయిన్నే కావాలనీ, లేకపోతే పెళ్ళి చేసుకుని హాయిగా సంసారం చేసుకుంటానని చెప్పినప్పటికీ అతను నన్ను వాంప్ పాత్రకు బలవంతంగా ఒప్పించగలిగాడు. చాలామంది ప్రముఖ నటీనటులు మొదట చిన్నచిన్న వేషాలతో ప్రవేశించిన వారేనని.. మొదట ప్రవేశించటం ముఖ్యమనీ హీరోయిన్ కావటానికి చిన్న వేషాలే సినీరంగ ప్రవేశానికి ఇంట్రడక్షన్‌లాంటిదని ఎన్నోవిధాల చెప్పి నన్ను ఒప్పించాడు.

నేనే సిగ్గుపడేలా నాచేత అర్ధనగ్న నృత్యాలు చేయించాడు.

ఇక ఈ పయనం ఎటువైపో!

*16 ఆగష్టు 1974: మొదటి విజయం*

అదృష్టమో, దురదృష్టమో నేను నటించిన వాంప్ పాత్రగల చిత్రం సూపర్ హిట్టయింది. అందులో నా పాత్ర మరీ క్లిక్కయింది. ఈ చిత్రం శతదినోత్సవ ఫంక్షన్‌లోనే మరో ఆరు సినిమాల్లో అలాంటి పాత్రలే చేయటానికి సైన్ చేసాను.

ఒక విజయం వచ్చిన అవకాశాన్ని ఎలాగోలా వినియోగించుకోవాలన్న నిర్ణయానికి వచ్చేలా

## బంగాళాబంతిపూల ముగ్గు



27 నుంచి 14
మధ్య చుక్క

గూడూరు హైమవతి
దుగ్గిరాల

చేసింది.

జీవన ప్రయాణం సాగిపోతోంది. ఖచ్చితమైన గమ్యంమాత్రం ఏమిటో తెలియటం లేదు.

*10 మే 1975: విజయపరంపర*

విజయం అంత తేలిగ్గా రాదు. విజయం రావటం మొదలైతే మాత్రం యిక దాన్నెవరూ ఆపలేరు. విజయం వెనక మరో విజయం.. అపూర్వ విజయం..నటించిన ప్రతిష్టలు కుప్పలుతెప్పలుగా వచ్చి పడుతున్నాయి.

అమ్మానాన్నలు ఎంతో సంతోషిస్తున్నారు. వారి కోరిక నెరవేరినట్టయింది.

తెలుగు, తమిళ, కన్నడ భాషా చిత్రాల్లో నేను బిజీగా వున్నాను. ప్రస్తుతం పదహారు చిత్రాల్లో నటిస్తున్నాను. నేను లేని సినిమా లేదు. నాకోసమే పాత్రలు సృష్టించబడుతున్నాయి.

ప్రస్తుతం నేనుశృంగార రససామ్రాజ్యానికి మహారాణిని.

*21 ఏప్రిల్ 1976: ప్రేమ:*

ఈ మధ్య ఒక హీరో పరిచయమయ్యాడు. నన్ను బాగా యిష్టపడుతున్నాడు. పెళ్ళిచేసుకుంటాడట. నేను తన ప్రేమదేవతనట. వయసు పెరుగుతోంది. ఆశలు... ఆశయాలకు అంతులేదు. స్త్రీ జీవితంలో పెళ్ళి అతి ముఖ్యమైన ఘట్టం. నాకూ పెళ్ళి చేసుకోవాలనే వుంది.

ఈ సినిమాలు, డబ్బు సంపాదనలు అన్నీ వదులుకుని భర్త, యిద్దరు పిల్లలతో ఓ అందమైన చిన్న పొదరిల్లులాంటి ఇంట్లో జీవితం గడపాలని వుంది. మరి నా ఈ ఆలోచనకు అమ్మానాన్నలేమంటారో తెలియదు.

ఇంతకూ నాకు పెళ్ళి చేయాలనే ఆలోచన వారికుందా?!

*1 డిసెంబర్ 1976 : విషాదం:*

డబ్బు మనిషిని ఎంతకైనా తెగించేలా చేస్తుందేమో! మానాన్న గారి కంపెనీ యొక్క పార్ట్‌నర్స్ అందరు ఏకమై మా నాన్నగారిని మోసం చేసారు. నా సంపాదన కూడా బిజినెస్‌లో పెట్టడం వలన బికారిలా మారింది ఆయన పరిస్థితి. ఆ అవమానాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకున్నారు. మేమున్న ఇల్లు తప్ప ఏమీ మిగల్లేదు. అమ్మా, నేను, తమ్ముడు, చెల్లి నలుగురం దిక్కులేని పక్షుల్లా మిగిలాము. నాన్నగారి మరణం నన్ను బాగా కృంగదీసింది. నా సినిమాలే ఇక యిప్పుడు మా జీవనాధారం. నా పరిస్థితి తెలిసీ ఎవరూ నాకు సాయం చేయటానికి ముందుకు రాలేదు. ప్రేమించానని చెప్పినవాడు కూడా మొఖం చాటేసి మోసం చేసాడు. అతని నిజస్వరూపమేమిటో అర్థమయింది. సాధ్యమైనంతవరకు నేను యితరులకు సాయపడ్డానే తప్ప ఎవరికీ కీడు తలపెట్టలేదు. మరి, నాకు సహాయం చేయటానికి ఎవరూ రారేమిటి? బెల్లమున్నంత సేపే ఈగలంటే యిదేనా?

ఒక్కో తెర తొలగినట్లు
మనుషుల మనస్తత్వాలు స్పష్టమౌతోంటే...
అనుబంధాల కోటగోడలన్నీ
పేకమేడలై కూలిపోతోన్న భావన.

*జనవరి 1980: భగీరథ ప్రయత్నం*

శత్రువుల దాడికి కూలిన కోటకు మళ్ళీ మరమ్మతు

చేసి యథాస్థితికి తెచ్చినట్లు ఎంతో శ్రమతో మళ్ళీ ఓ స్థాయికి చేరుకున్నాను. తీసేవారికి డబ్బు, చూసేవారికి వినోదం యిదే సినీ ఫార్ములా. నా చుట్టూ భజన పరులు చేరిపోయారు. వారి స్వప్రయోజనాలకు నా డబ్బు, పలుకుబడి ఒక నిచ్చెనలాగా వాడుకుంటున్నారు. అయినా నేనేమీ చేయలేకపోతున్నాను. దేహీ యని వచ్చినవారిని కాదనలేని నిస్సహాయత నాది. ఇప్పటిదాకా నా కెరియర్లో రెండువందల సినిమాలు పూర్తిచేసాను. అయినా తృప్తిలేదు. హీరోయిన్‌గా మంచి పేరు పొందాలన్న నేను వాంప్ పాత్రలకే పరిమితమైపోయాను. అయినా దేశవ్యాప్తంగా నాకిప్పుడు ఓ ప్రత్యేకమైన గుర్తింపే వుంది. మత్తుకళ్ళ సుందరిగా...యువకుల హృదయసామ్రాజ్యాల్ని కొల్లగొట్టిన ఘనత నాకు దక్కింది.

నేను లేని సినిమా లేదు. నాఫోటో లేని సినీ పత్రిక లేదు. నేను తెలియని సినీ ప్రేక్షకుడూ లేదు.

బిజీ..బిజీ.. కాలం బిజీగా సాగుతోంది. ఈ బిజిలో అసలు నేను సాధిస్తున్నదేమిటి? పోగొట్టుకుంటున్నదేమిటి?

పాలిచ్చినంత కాలం ఆవునిసాకి తరువాత కసాయి వాడికమ్మిన చందంగా మారింది నాస్థితి. నాకు నోటమాట రాలేదు. నేనేమై పోతున్నానసలు? అసలు నే చేసిన పాపమేమిటి? నా అన్నవారే నాకింత అన్యాయం చేస్తారా?

***24 నవంబర్ 1980: కొత్త నిర్ణయం:***

ప్రముఖ నిర్మాత రామశర్మ కొడుకు ఈమధ్య నాతో సన్నిహితంగా వుండడానికి ప్రయత్నిస్తున్నాడు. కాస్ట్యూమ్ డిజైనర్‌గా అతను ఎక్స్‌పర్ట్. చాలా సినిమాల్లో మేమిద్దరం కలిసి పనిచేసాము. ఆ విధంగా మామధ్య కాస్త సన్నిహితం పెరిగింది. నేనంటే ప్రత్యేకమైన ఇంట్రెస్ట్ చూపిస్తున్నాడు.

నాకూ ఓ తోడూ కావాలనిపిస్తోంది. ఇప్పుడు డబ్బుకు లోటు లేదు. తమ్ముడు మంచి ఉద్యోగం చేసుకుంటున్నాడు. చెల్లికి పెళ్ళిచేసి అత్తారింటికి పంపాను. ఒంటరి జీవితం ఎన్నాళ్ళని గడపగలను. అందుకే నేనో నిర్ణయం తీసుకున్నాను. అభితో జీవితం పంచుకోవాలని అనుబంధం పెంచుకోవాలనీ. అభి మొన్నోరోజు నాతో పెళ్ళి ప్రపోజల్ తెచ్చాడు. సరేనన్నాను. ఆ విధంగా ఓ కొత్తనిర్ణయానికి పునాది వేయబడింది.

ఆశల పునాదిమీద నేను నిర్మించుకుంటోన్న వూహల సౌధం పేకమేడ వలె కూలిపోకుండా వుంటుందా? ఏమో!

కాలనిర్ణయానికి తిరుగులేదు కదా!

***10 జనవరి 1981***

కొన్ని తలరాతలు అంతేనేమో! కొన్ని జీవితాలు వూహల్లో తప్ప వాస్తవంగా సుఖపడే యోగ్యత కలిగి వుండవేమో! అందుకు ప్రత్యక్ష సాక్షిని నేను. అవును నూటికి నూరుపాళ్ళూ నేనే.

నేనిష్టపడిన వ్యక్తి...నన్నిష్టపడిన వ్యక్తి...నాలో బ్రతుకుపట్ల ఆశను కల్గించిన వ్యక్తి నాకు దూరమౌతాడని నేను కలలోకూడా వూహించలేదు.

సాయంత్రం ఆరుగంటలకు అభి నాకు ఫోన్ చేసి చెప్పేడు. హోటల్ తాజ్‌లో రాత్రికి డిన్నరు తీసుకుందామని.. ఏడుగంటలకు వచ్చి పికప్ చేసుకుంటాను సిద్ధంగా వుండమని.

ఆరున్నరకే తయారయ్యాను. భవిష్యత్తును అందమైన హరివిల్లులా ...పూ పొదరిల్లులా ఊహించుకుంటూ... యింతవరకు నేనే సినిమాలోనూ నటించనంత అందమైన ఆ ప్రదేశంలో పాట పాడుకుంటున్నాను.

నా ఊహల్తోపాటే కాలమూ పిల్లగాలులై పరుగెత్తినట్టైంది. గోడగడియారం ఎనిమిది గంటలు కొట్టింది. ఆ చప్పుడుకు నేను నా లోకంలోంచి ఈ లోకంలోకి వచ్చాను. నా పరిస్థితికి నేనే నవ్వుకున్నాను. మధురమైన నిరీక్షణావాహినిలో నేను ఓలలాడుతున్నాను. ఎంత ఆనందం!

రాత్రి తొమ్మిదయింది...పదయింది. అయినా అభి జాడలేదు. కానీ ఫోన్ కాల్ మాత్రం వచ్చింది.

నా దగ్గరకు వస్తోన్న అభి కారును ఎదురుగా వస్తున్న లారీ అమాంతం గుద్దేసింది. హాస్పిటల్లో చేర్పించటం, అతను నన్ను కలవరించటం, నాకు ఫోన్ చేయటం జరిగిపోయింది. నా కాళ్ళ కింద భూమి కంపించినట్టయింది. డీప్‌షాక్‌కి లోనయ్యాను. హాస్పిటల్‌కి ఎలా వెళ్ళానో తెలియదు.

అప్పటివరకూ బిగబట్టుకున్న దుఃఖం ఉప్పెనైవచ్చింది. ఒంటినిండా గాయాలయ్యి, రక్తసిక్తమైన దేహంతో పద్మవ్యూహంలో అభిమన్యుడిలా ఆఖరిదశలో వున్న అభిని చూడగానే.

నాకోసమే ప్రాణాలరచేతుల్లో పెట్టుకుని వున్నట్లు నే వెళ్ళి పిలిచేసరికి బలవంతంగా కళ్ళు తెరిచి.. కొన్ని క్షణాలు జాలిగా చూస్తూ నా చేతిలో చేయి వేసి కన్ను మూసాడు. అలా శాశ్వతంగా.

ఒక మధురస్వప్నం కరిగిపోయింది. ఒక అధ్యాయం ముగిసిపోయింది.

ఇక నేనేమైపోతానో! విధి నిర్ణయం ఏమిటో!!

***26 డిసెంబరు 1985: మళ్ళీ ఒకటి:***

మరుగునపడిన జ్ఞాపకాల పునాదుల మీద భవిష్యత్తు భవనం నిర్మించబడుతుందేమో!

అభిలేని లోటు తీరనిదే అయినా అతని బాధ కొద్దికొద్దిగా మర్చిపోగలుగుతున్నాను.

మళ్ళీ సినిమా షూటింగులతో కాస్తో కూస్తో బిజీ అయ్యాను.

అభి నన్ను వదిలిపోయి నాలుగేళ్ళవుతోంది. ప్రస్తుతం నా వయసు ముప్ఫై ఒకట్లో ప్రవేశించింది.

***15 ఫిబ్రవరి 1990: స్వార్థం పడగవిప్పినవేళ:***

స్వార్థం ఎంతటి పనైనా చేయిస్తుందనీ.. డబ్బు ముందు ఎన్ని సంబంధాలైనా పేకమేడల్లా కూలవలసిందేననీ.. యిక్కడ కన్నబిడ్డలనీ, తోడబుట్టినవారనీ ఎలాంటి బంధాలైనా బలాదూరని ప్రత్యక్షంగా తెలిసివచ్చింది.

ఈ మధ్య సినిమా అవకాశాలు పూర్తిగా తగ్గిపోయాయి. కొత్తనీరొచ్చి పాతనీటిని పోగొట్టినట్లు, హీరోయిన్లే మా వాంప్ పాత్రలకంటే కూడా అర్థనగ్నంగా నటిస్తూ అంగాంగ ప్రదర్శన చేస్తున్నారు. వెనుకటి తరంలో నిండైన కట్టు బొట్టుతో హీరోయిన్ని చూస్తేనే నమస్కరించేలా వుండేది. ఇప్పుడలా కాదు. ఎంత తక్కువ బట్టలేసుకుంటే అంత పెద్ద హీరోయిన్. అందుకే మాలాంటి వారికి అవకాశాలు తగ్గిపోయాయి.

ఈ నేపథ్యంలో కలలో కూడా వూహించని సంఘటన మరోటి జరిగింది. ఇన్నాళ్ళ నా సినీజీవిత లావాదేవీలన్నీ మా అమ్మే చూసింది. ఏ బ్యాంకులో ఎంత డబ్బుందో... ఎక్కడెక్కడ ఏమేమి ఆస్తులు కూడబెట్టిందో నేనేనాడూ పట్టించుకోలేదు. ఫలానా బ్యాంకులో డబ్బు వేస్తున్నాను. ఫలానా చోట స్థలం కొన్నానని చెబితే వినటం, చెప్పినచోట సంతకం చేయటమే నా పనీ. అయితే వ్యవహారమంతా అమ్మే చూసేది. ఆమెకిచ్చిన వ్యవహార బాధ్యతను మరోలా కూడా నెరవేర్చింది. నా ఆస్తినంతటినీ తను స్వాధీనం చేసుకుని కేరళలో వుంటున్న చెల్లిదగ్గరికెళ్ళిపోయింది. పాలిచ్చినంతకాలం ఆవునిసాకి తరువాత కసాయివాడికమ్మిన చందంగా మారింది నాస్థితి. నాకు నోటమాటరాలేదు. నేనేమైపోతున్నానసలు? అసలు నే చేసిన పాపమేమిటి? నా అన్నవారే నాకింత అన్యాయం చేస్తారా? డబ్బుకోసం కాదు నా బాధ. నా పట్ల నా తల్లి బాధ్యత యిదా? ఇదేనా కూతురి పట్ల తల్లి ప్రేమ? తీవ్రమైన మానసిక వేదన భరించలేకపోతున్నాను. నేనేమైపోతున్నాను?

ప్రస్తుత కర్తవ్యమేమిటి? భవిష్యత్తు దారేమిటి?

***20 మే 1990: అంతిమ నిర్ణయం:***

కొందరు సలహా యిచ్చారు. నా వారి? మీద కేసు పెట్టమని. తప్పకుండా గెలుస్తానని.

మనీ కేసు పెట్టాలి. ఆస్తి కాజేసారనా? ఒకవేళ ఆస్తివచ్చినా వారి ప్రేమ వస్తుంది? నా నుంచి వారు ఆస్తి ఆశించారు. నేను వారి ప్రేమ కోరుకున్నాను. నేను కావాలనుకున్నదేదీ నాకు దక్కలేదు. వారు కోరుకున్నదైనా పొందనీ. నా మనసుకు గాయమైంది. దానికి కేసు పరిష్కారం చూపదు.

అందుకే ఓ నిర్ణయానికి వచ్చాను. దాన్ని అమలుచేసాను.

ఇంటిని అమ్మేసాను. ఇరవై లక్షలకు. కనీసం యిదైనా మిగిల్చారు ఎందుకోమరి. ఆ డబ్బుని వృద్ధ శరణాలయానికి విరాళంగా యిచ్చేసాను.

ఇక మిగిలింది మరోపని. ఈ మధ్య ఉత్తరప్రదేశ్‌లో అనాథ శరణాలయం స్థాపించారు. అందులో చేరటానికి అనుమతి తీసుకున్నాను.

రాత్రికి రాత్రి అంతా వదులుకుని..కాదు అంతా పోగొట్టుకుని చిన్న వయస్సులోనే ఎదురుదెబ్బలెన్నో తిని, లెక్కలేనన్ని అనుభవాలు గడించి, ముఖ్యంగా జీవితంలో ఓడిపోయి పయనమయ్యాను. ఈ శరణాలయం మదర్‌థెరిసా ఆశయంతో పనిచేస్తుంది. అందుకే యిక్కడ చేరుతున్నాను. ఇక్కడి వాతావరణం బాగా నచ్చింది. పూర్వం రుషులుండేవారంటారే అంతటి ప్రశాంత వాతావరణం దానికి తోడు పవిత్రమైన ఆశయం.

మానవసేవయే మాధవ సేవ అన్నదానికి అర్థం – చెప్పరు. చేసి చూపిస్తారు. అందుకే మిగిలిన ఈ జీవితకాలాన్నంతా నాలాంటి అనాథలకు సేవచేస్తూ గడపాలని నిర్ణయించుకున్నాను. ఇక ఈ ప్రాణి ఇక్కడే రాలిపోతుంది. ఇంక సెలవు. ★